Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# తత్త్వ ప్రక్రియ లక్షణాలు

అంకె శ్రీనివాసులు
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ కళాశాల (స్వ),
అనంతపురము.
సెల్: 9652471652
email: ankesreenivas@gmail.com

ఏ సమాజమైనా తన దృక్పథాన్ని, తన అస్తిత్వాన్ని, సంస్కృతిని స్థిరపరిచే సాహిత్యాన్ని వ్యక్తీకరిస్తుంది. అదే సమయంలో ఆ సమాజాన్ని ప్రతిఘటించే సాహిత్యం పుట్టుకొస్తుంది. కొన్ని సందర్భాలలో మరొక ప్రత్యామ్నాయ సమాజాన్ని ఏర్పాటు చేయాలనుకొనే సాహిత్యం కూడ అదే సమాజం నుండే వస్తుంది. ఇది నిరంతర ప్రక్రియ. తెలుగులో అనేకమంది రాజాస్థాన కవులు భూస్వామ్య వ్యవస్థను కీర్తిస్తూ కావ్యాలు రాశారు. దీనికి భిన్నంగా అన్నమయ్య, ధూర్జటి వంటివారు ఆ పాలనా వ్యవస్థను వ్యతిరేకిస్తూ ఒక ప్రత్యేకమైన ప్రతిఘటనా సాహిత్యాన్ని వ్యక్తం చేశారు. ఆనాటి సామాజిక వ్యవస్థలో ఇదొక అసాధారణ పరిణామం. అయితే ప్రతిఘటనా కవులు ఆనాటి సామాన్య ప్రజానీకానికి ప్రాతినిధ్య సాహిత్యాన్ని రాశారనికాదు. వీరు కేవలం భూస్వామ్య పాలనా వ్యవస్థతో కలిగిన అభిప్రాయ భేదాలతో, కేవలం ఆస్థానేతర సాహిత్యాన్ని మాత్రమే సృష్టించారు. వారికి, సాంప్రదాయ కవులకు భిన్నమైన సామాజిక దృక్పథం లేదని మనం గుర్తుంచుకోవాలి. ప్రబంధం సింహాసనం మీద కూర్చుంటే, కొంతకాలం సంకీర్తన ప్రక్రియ ప్రజాసింహాసనం మీద కూర్చుంది. అయితే ప్రబంధ, సంకీర్తనల మధ్య భాషాపరమైన భేదమే తప్ప దృక్పథ వైవిధ్యం లేదు. అందుకే పదహారవ శతాబ్దంలోనే సంకీర్తన, ప్రబంధ ప్రక్రియలకు ప్రత్యామ్నాయంగా 'తత్త్వము' అనే ప్రక్రియ ఆవిర్భవించింది. ఇది సంకీర్తన లాగా పాట! సంకీర్తనల్లాగే పల్లవి, అనుపల్లవి, చరణం అనే లక్షణాలు తత్వానికీ ఉన్నప్పటికి, వస్తురీత్యా, దృక్పథరీత్యా తత్త్వం చాలా భిన్నమైనది. సంకీర్తన, ప్రబంధాలు కేవలం కులమతాలను విమర్శించాయే తప్ప కులమతాలు నశించాలని, కులరహిత సమాజం కావాలని చెప్పలేదు. "ఉర్వివారికెల్ల ఒక్క కంచము బెట్టి పొత్తు గడిపి కులము పొలయ జేసి, తలను చేయిబెట్టి తగనమ్మ జెప్పరో" అనే వేమన భావన అన్నమయ్య మాట కన్నా బలమైనది. వేమన దృక్పథం, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకుంటున్నది. కులం పోవాలని వేమన చెప్పడానికి, అన్ని కులాలు సమానమని అన్నమయ్య చెప్పిన విధానానికి చాలా తేడావుంది. అన్నమయ్య తన కుల పరిధిని దాటలేక అందరూ సమానమేనన్నాడు. వీరబ్రహ్మం వేమనవంటివారు అసలు కులమే ఉండకూడదని అన్నారు. తత్వకారులంతా శ్రామిక దిగువ కులాలకు చెందినవారు.

పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాలకు చెందిన తత్వకారులు కులరహితమైన ప్రత్యామ్నాయ సమాజాన్ని గురించి కలలు కన్నారు. ఆ కలలూ, ఆకాంక్షలు ప్రజాస్వామికమైనవి. పద్యరూపంలోని ప్రబంధం పండితాదరణ పొందితే, వాడుక భాషలోని తత్వము ప్రజాదరణ పొందింది. పోతులూరి వీరబ్రహ్మం, యాగంటి లక్ష్మయ్య, సిద్ధయ్య పీరు మొహిద్దీన్, బోరా అప్పలస్వామి, గుజ్జల నారాయణదాసు, కైవారం నారాయణ వంటి తత్వకారులు సామాన్య ప్రజానీకంలో తమ తత్వాల ద్వారా చైతన్యాన్ని కల్గించారు. వీరు చాలా విషయాలలో వేమనతో భావసామీప్యతను

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కలిగివున్నారు. ప్రతి శతాబ్దానికి తనదైన సామాజిక స్వభావం ఉంటుంది. ఆ సామాజిక స్వభావాన్ని చరిత్రకారులు, సాహిత్యకారులు ఏమాత్రం గుర్తించకుండా పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాలు తెలుగు సాహిత్యంలో క్షీణయుగమని చెప్పడం శోచనీయం. వాస్తవానికి మొత్తం తెలుగు సాహిత్య చరిత్రలోనే సరికొత్త సాహిత్యాన్ని ఈ నూతన ప్రజాస్వామిక శక్తులు వ్యక్తీకరించిన కాలమది. ద్వ్యర్థి, త్ర్యర్థి, చతురర్థి కావ్యాలతో, పిల్లవసుచరిత్రలతో పద్యం కునారిల్లుతుంటే సామాన్య ప్రజానీకంలో మాత్రం తత్వం పరిమళించింది. ప్రబంధం, పురాణం, సంకీర్తనతో పాటుగా తత్వాన్ని ఒక ప్రక్రియగా గుర్తించకపోవడమంటే ప్రజాస్వామిక శక్తుల అభివ్యక్తిని పరిగణనలోనికి తీసుకోకపోవడమే అవుతుంది. శ్రామిక కులాల సాహిత్యానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడమే అనిపిస్తుంది!

ప్రక్రియరీత్యా సంకీర్తన కన్నా తత్వం భిన్నమైనది కాకపోవచ్చు. కానీ వస్తురీత్యా చాలా వైవిధ్యమైనది. తత్వానికి ప్రత్యేకమైన లక్షణాలున్నాయి. అవి అంతకుముందున్న ప్రక్రియలకన్నా చాలా వైరుధ్యమున్నవి. సంకీర్తనతో తత్వానికి కేవలం ఒకటి, రెండు విషయాలలో మాత్రమే సామీప్యత ఉంది, తప్ప మిగిలిన లక్షణాలు భిన్నమైనవి. అచలతత్వంగా వీరి భావశాఖ తెలుగుదేశంలో విశేష ప్రచారాన్ని పొందింది.

**1. శూద్రకవులు - కులరహిత సమాజం**

అన్నమయ్య తెలుగులో పదకవితా పితామహుడిగా పేరుగాంచాడు. అంతకన్నా ముందే సింహగిరివచనాలు (కృష్ణమాచార్యులు) రాగఛాయతో తాళానుగుణంగా తంత్రీశ్రుతి సమన్వితంగా వున్నాయి. అయినప్పటికీ రసావిష్కరణలో, పదసముచ్చయంలో తులనాత్మకంగా సింహగిరివచనాలతో పోల్చిచూస్తే అన్నమయ్య పదకవితలు కాసింత ఎక్కువస్థాయి రచనలన్నది నిర్వివాదాంశం. అన్నమయ్య పదాలు కవిత్వపరంగా, త్యాగయ్య పదాలు సంగీతపరంగా చాలా గొప్పవని, క్షేత్రయ్య పదాలు అభినయ స్వభావమున్నవని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ నిరూపించారు.

అన్నమయ్య పదాలు రాగఛాయతో ఉన్నప్పటికీ లభించిన రాగి రేకులలో తాళ సమన్వయ సూచన చేయలేదు. అన్నమయ్య తర్వాత రామదాసు, క్షేత్రయ్య, త్యాగయ్యలు తెలుగు సంకీర్తనలను సర్వలక్షణ సమన్వితంగా రాశారు. అయితే ఈ నలుగురూ బ్రాహ్మణులు, తత్వకారులు బ్రాహ్మణేతరులు. వేమన రెడ్డి కులస్తుడనే వాదనను రాళ్ళపల్లి అంగీకరించలేదు. అయినప్పటికీ శూద్రుడన్న విషయం నిర్వివాదాంశం. పోతులూరి వీరబ్రహ్మం, ఆయన మనుమరాలు ఈశ్వరమ్మ విశ్వబ్రాహ్మణ కులస్తులు. సిద్ధయ్య, పీరుమొహిద్దీన్ దూదేకుల కులస్తులు. సిద్ధయ్య, వీరబ్రహ్మంగారి శిష్యుడు కూడ! గుజ్జల నారాయణదాసు బోయకులానికి చెందినవ్యక్తి . కైవారం నారాయణ బలిజ సామాజిక వర్గానికి చెందినవాడు. బోరా అప్పలస్వామి యాగంటి లక్ష్మయ్య ఏకులమన్నది స్పష్టంగా తెలియక పోయినప్పటికీ శూద్రులన్నది స్పష్టం.

"మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒక్కటే

చండాలుండేటి సరిభూమి ఒక్కటే" అని అన్నమయ్య అన్ని సామాజిక వర్గాలు సమానమేనని చెప్పాడు. అయితే శూద్రతత్వకారులు కులవ్యవస్థనే తీవ్రంగా వ్యతికేరించారు.

"ఏ కులమని నను వివరం బడిగితే

యేమని తెల్పుదు లోకులకు పలుగాకులకూ

దుర్మార్గులకూ ఈదుష్టులకూ ..."[1] అని సిద్ధయ్య తీవ్రంగా విరుచుకుపడ్డాడు.

"మగ్గంబట్టి నేసే ..."[2] వారు మనుషులేనని లక్ష్మయ్య వ్యాఖ్యానించాడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

"కొన్నాళ్ళు శూద్రులు - కొన్నాళ్ళువిప్రులు
వేషాలు వేసెరెందుకురా
ముఖ్యుడు శూద్రుడు - ముజ్జగములకెల్ల
తక్కిన వారెల్ల తక్కువరా"[3] అని కైవారం నారాయణ శూద్రాధిక్యతను ప్రకటించాడు. అంతేగాక

"పుట్టుబ్రహ్మచారి - ఆచార్యుడనవచ్చు
కడమవారెల్ల అనాచార్యులురా?"[4]
"కులము విడిచినారము - ఏకులములోనాకలవము
కులగోత్రముల కూలవేసి కుదురమెక్కినాము"[5] అని కులవ్యవస్థను కూల్చి వేయాలని తిరుగుబాటు చేశాడు. 'కులము లేనివాడే ఘనుడు తానౌను' అని కులరహిత ఆవశ్యకతను గుర్తించాడు.

"ఉర్వివారికెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తు గుడిసి కులము పొలయజేసి
తలను చేయిబెట్టి తగనమ్మ జెప్పరో"[6]

అని ప్రకటించిన వేమన భావాలను తత్వకారులు మనస్ఫూర్తిగా సమర్థించారు. శ్రమ ప్రాధాన్యతను గుర్తించారు. శ్రామికుడు మాత్రమే గొప్పవాడని (ఘనుడు) తేల్చిచెప్పారు. వీరబ్రహ్మం దూదేకుల సిద్ధప్పను, దళితుడైన కక్కయను చేరదీయడమే గాక "కులమనేటి తెగులు కొంపలు గూల్చును" అని ధైర్యంగా ప్రకటించాడు.

మతము మత్తుమందు వంటిదని చెప్పిన కార్ల్‌మార్క్స్ కన్నా రెండు వందల సంవత్సరాలు ముందే వీరబ్రహ్మం సమాజాన్ని హెచ్చరించాడు చూడండి.

"మతము మత్తుగూర్చుమార్గమ్ము కారాదు
హితము గూర్పవలయు నెల్లరకును
హితము గూర్చలేని మతము మానగవలె"[7] అని చాలా స్పష్టత కలిగిన తత్త్వవేత్త వీరబ్రహ్మం. ఆయనను భవిష్యత్తును చెప్పే వ్యక్తిగానే నేటి సమాజం చూడటం దురదృష్టం. కులమతాలు సామాజిక ప్రగతికి ఆటంకమని గుర్తించిన తొలి దార్శనికుడు.

**2. వాడుకభాష**

తత్వకారులు పండితకవులు కారు.. వేమన, వీరబ్రహ్మం వంటి ఒకరిద్దరికి కాస్తా పాండిత్యమున్నప్పటికీ అది చాలా స్వల్పం. సంకీర్తనకారులంతా పండితులని తెలిసిందే. తత్వకారులు మాత్రం తమకు తెలిసిన వాడుకభాషలో తమ భావాల్ని పాటలుగా (తత్వాలుగా) ప్రచారం చేశారు.

"కులము నెంచగ నేల గుణమే కారణము
కులబంధు కులమాయె కులమెక్కువేది"[8]
"భజనయెట్టిదో తెలియరా
నిజము కనుగొని నడువరా
అజుడు రాసిన వ్రాత కొలదిగా సుజనులకు ఇది చిక్కురా"[9]
"చందమామా చందమామా

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

సందు తెలిపే జ్ఞానులెవరే చందమామ"[10]

అని సహజ సుందరమైన వాడుకభాషను, కొన్ని సందర్భాలలో మాండలికాలనూ గౌరవించారు. ఇది సంకీర్తనకారుల నుండి తెచ్చుకున్న లక్షణం. ఈ వ్యవహారిక భాషా ప్రయోగం వల్ల సామాన్య ప్రజానీకంలో వీరు విశేష గౌరవాన్ని పొందారు. గిడుగు, గురజాడల కన్నా శతాబ్దాలముందే వ్యవహారిక భాష ఆవశ్యకతను గుర్తించడమేగాక భాషా కాఠిన్యతను వ్యతిరేకించారు.

"మూడు యుగములందు ముదితలు ముగ్ధలు

పురుష దౌష్ట్యమునకు పొగిలినారు

కలియుగాన కాంతలిల నేలగలరయా" అని పోతులూరు వీరబ్రహ్మం స్పష్టంగా వ్యాఖ్యానించారు. గురుజాడ అప్పారావు ఇదేవిధంగా ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని చెప్పాడు. గురజాడ కన్నా శతాబ్దాల ముందే స్త్రీ ప్రాధాన్యతను గుర్తించాడు వీరబ్రహ్మం. స్త్రీలను విద్యకు దూరం చేయడాన్ని కూడా తీవ్రంగా నిరసించాడు.

**3. గురూపదేశం - తారకమంత్రం**

తత్త్వకారులంతా ఒక గురువు ద్వారా ఉపదేశాన్ని పొంది ఆ గురుపరంపరను కొనసాగించాలని దీక్ష పూనారు. తాము పొందిన గురూపదేశాన్ని సామాన్యులకు ఉపదేశిస్తూ సమాజాన్ని చైతన్యపరిచారు. తమ భావాలకు అనుగుణంగా చాలా నిబద్ధతగా జీవించారు. తత్వకారులంతా గురూపదేశం పొందినవారే! గురువు బోధించిన మంత్రమే వారికి తారకమంత్రం. దానిని నిరంతరం స్మరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. వీరబ్రహ్మం సిద్ధయ్యను చేరదీశాడు. అల్లాడపల్లి వీరభద్రయ్య శిష్యుడు యాగంటి లక్ష్మయ్య, అదేవిధంగా యోగినారాయణ గురువు పరదేశిస్వామి.

గురుబోధ ద్వారా పొందిన తారకాన్ని ప్రజలకు అందజేశారు.

"తారక మంత్రము కోరిన దొరికెను

ధన్యుడనైతిరా ఓరన్నా ..."[11] అని ఎంతో సంతోషించారు.

"తారకము చూపెరుగ వలెనన్నా

సద్గురుని కృపచే / తారతమ్యము తరచి కనుగొనుమన్నా

ధరణిలోపల మరేఢమతులకు

దొరుకుట బహుదుర్లభంబిది

గురు కటాక్షము వలన స్థిరమగు

పరమ పదవికి చేరే యుక్తి"[12] అని గురువుకి అగ్రతాంబూలమిచ్చి వారి బోధవల్ల అత్యున్నత స్థాయిని అందుకోవచ్చుని ప్రకటించారు. తనలోని 'తారక జ్యోతి' తెలుసుకొని ఆత్మోన్నతి పొందాలని చెప్పారు.

**4. రాజయోగం - స్త్రీ సమానత్వం**

దాంపత్యాన్ని, సాంసారిక సుఖదుఃఖాలను స్వాగతించారు. స్త్రీపురుష సమానత్వాన్ని కోరుకున్నారు.

"రాజయోగము రమ్యమందురు బోధ తెలుపుము గురువరా"[13] అని గురూపదేశంలో సాంసారిక జీవితంలోని గొప్పదనాన్ని చెప్పి రాజయోగాన్ని బోధించాలని కోరుకున్నారు. ఆధ్యాత్మిక, పండిత, సంకీర్తన కవులు సంసార సాగరాన్ని (భవసాగరం) ఈదడం చాలా దుర్లభమని చెప్పారు. కానీ సంసారంలోని కష్టసుఖాలను తత్త్వకారులు జీవితంలో భాగంగానే చూశారు.

"ఇది రాజయోగం - సుధారస పరిపూర్ణ లింగ'

సేవించి ధన్యుడై - చెడని పదవి జేరు"[14] అని చెప్పడం ద్వారా అదే జీవితాన్ని ధన్యం చేస్తుందని త్రికరణ శుద్ధిగా నమ్మారు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే పాతివ్రత్యాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించడం.

"పతివ్రత యనుచును నారీ

అతిశయగుణములకు మెచ్చిపెంచె ..."[15] విధానాన్ని నిరశించారు. అదే సమయంలో పరపురుష వ్యామోహాన్ని కూడ తీవ్రంగా వ్యతిరేకించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను చాలా ఇష్టపడ్డారు.

సాంసారిక యోగమే రాజయోగమని వీరి అభిమతం. ఇది యోగమార్గంలోని రాజయోగం కాదు. తత్త్వకారులు స్త్రీలను పురుషుడితో సమానంగా చూశారు.

"పెలదులకును వేదవిద్యాధికారమ్ము


లేదటంచు బ్రహ్మ లిఖితమంచు

నోరు తెరచి మరచినారు వాణిని, నిన్ను" అని వీరబ్రహ్మం 'విధిరాత' పద్ధతిని నమ్మలేదు. తన మనుమరాలు ఈశ్వరమ్మను తన వారసురాలిగా గుర్తించాడు. ఆయన శిష్య పరంపరలో గోవిందమ్మ కూడ ఉంది. అతివేలా శృంగారాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన తొలి సృజనకారులు వీరే! స్త్రీ గొప్పదనాన్ని గౌరవించి, తమ శ్రామిక జీవితంలో భాగమైన స్త్రీని అబలగా పరిగణించిన తత్త్వకారుడు కనిపించడు. అష్టవిధ నాయికలకు, దక్షిణ నాయకులకు, ధీరోధాత్త, ధీరలలిత, ధీరశాంత వంటి నాయక పాత్రలకు ఇక్కడ అవకాశమే లేదు. వీరి తత్వాలలో, రచనలలోని వ్యక్తులంతా పుస్తకపాత్రలు కాదు, రక్తమాంసాలు, హృదయమున్న మనుషులు. అందువల్ల స్త్రీకి విద్య అవసరమని, గురూపదేశానికి స్త్రీలు అర్హులని ప్రకటించారు. చాలా సందర్భాలలో వీరి కుటుంబంలోని స్త్రీలు వీరికి శిష్యులు కూడ! అక్షరజ్ఞానం లేని స్త్రీలకు, శూద్ర, దళిత కులాలకు వీరి 'అచలతత్వం' అర్థం కావడానికి పాండిత్యభాషను కాకుండా సహజ సుందరమైన వాడుకభాషకు ప్రాధాన్యత నిచ్చారు. సహజంగానే సంసారంలోని సంతోషాన్ని చూశారు. సంసార సాగరాన్ని ఈదలేము అనే పలాయన వాదాన్ని తిరస్కరించారు.

## 5. విగ్రహారాధనకు వ్యతిరేకం

హైందవమతంలో విగ్రహారాధన చాలా ముఖ్యమైనది. దేవున్ని విగ్రహరూపంలో కొలవడం వల్ల ఏవిధమైన ప్రయోజనం లేదని ఆత్మను పరమాత్మలో లీనం చేయడం వల్ల మాత్రమే ముక్తి నందుకోవడం సాధ్యమని నమ్మారు. వీరిలో ఎక్కువ మంది యోగసాధకులు ఇక్కడ విగ్రహారాధనకు వ్యతిరేకమంటే నాస్తికులని అర్థం కాదు. తత్వకారులందరూ ఆస్తికులే. అయితే ఆత్మద్వారా మాత్రమే భగవంతున్ని దర్శించుకోగలమని, భగవంతునిలో ఐక్యం కావడమే మఠలమని వీరు ప్రకటించారు. ఈశ్వరతత్త్వాన్ని గుర్తించి విగ్రహారాధనకు మాత్రమే వ్యతిరేకమని ప్రకటించడానికి ఒక ప్రత్యేక కారణం ఉంది. అనాదిగా శూద్రులకు, దళితులకు దేవాలయ ప్రవేశం లేదు. అందువల్ల భజనకూటాల ద్వారా గ్రామాలలో సంచరిస్తూ తత్వగానం చేస్తూ విగ్రహారాధనను వ్యతిరేకించారు. పరమాత్మ నిరాకారుడని, నిర్గుణస్వరూపుడని తెలియజేశారు. ఆత్మద్వారా ముక్తిని సాధించడం వల్ల మనిషి బ్రహ్మ అని గుర్తించడమే వీరి తత్వచింతనలోని ప్రధాన అంశం. కైలాసం, వైకుంఠం, కైవల్యం వంటివన్నీ ఆత్మ ద్వారా మాత్రమే సాధించవచ్చునని, పరమాత్మ విగ్రహ స్వరూపుడు కాదని చెప్పారు.

"చిల్లర రాళ్ళకు మొక్కుతునుంటే


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

చిత్తము చెడురా ఒరే ఒరే"[16] అని వీరబ్రహ్మం ప్రచారం చేశాడు.

తారకామృత సారకర్తలైన తత్త్వత్రయం మరింత దూకుడుగా ప్రవర్తించారు.

"ప్రపంచనడతా జూటా - మన పెద్దమాటల బాట

ముగ్గురు మూర్తులు జూటా - మూలము ఎరుగుట బాట"[17] అని తిరుగుబాటు చేశారు.

"అదిగో చూడవె మనసా ఆత్మలో ముక్తి

పదిలముగ సాధింప బ్రహ్మంబె తానగును"[18] అని ఆత్మ సాక్షాత్కారానికి విశేష ప్రాధాన్యతనిచ్చారు.

"కంటిమయ్యా కైవల్యాము కన్నులాయందు

వింటిమయ్యా ప్రణవనాదం వీనుల యందు"[19] అని దృశ్య, శ్రవణాలన్నీ ఆత్మద్వారా మాత్రమే సాధ్యమని తేల్చిచెప్పారు. కేవలం స్థానిక గ్రామ దేవాలయాలనే కాకుండా పుణ్యక్షేత్ర సందర్శనాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించారు చూడండి.

"ఆత్మరాముల గానలేకను మూత్రకొంపలో మునిగి చెడుదురు

నేత్రద్వారము నందు పెళ్ళిన సూత్రధారుని గాన లేకను

క్షేత్రములకు పోదురేమన్నా

త్రేతాయుగము వారి ప్రతిమలు కల్పింపబడెనన్నా

మఠొఢులకు ముఖ్యము భూత పూజల యందు ప్రేమన్నా

తనలో నున్న తత్వ మెవ్వరు తరచి గనరన్నా

పాపిష్టిజన్మము ఎత్తినందుకు ఫలము ఏదన్నా

మోతగల రుద్రాక్షమాలలు నీతితో ధరియించి గొణగిన

సత్యజ్ఞానము గానలేకను నిత్యమోక్షము జెందజాలరు"[20]

మలమఠొత్ర భాండాగారమైన శరీరం ద్వారా విగ్రహాలను పూజిస్తే ముక్తి కలుగదు. పుణ్యక్షేత్రాలకు వెళ్ళడం వల్ల కూడా మోక్షం లభింపదు. రుద్రాక్షమాలలు, విభూది ధరించడం వల్ల ప్రయోజనం లేదు. అయోధ్య రామున్ని కాకుండా ఆత్మరామున్ని కనుక్కోవడమే లక్ష్యమని, తత్వస్వరూపుడైన పరమాత్ముడు బయటలేడని, దైవం ఆత్మస్వరూపమని వ్యాఖ్యానించారు. వీరి భావాలు కొన్ని శంకరాచార్యుల అద్వైతానికి చాలా సమీపంగా ఉంటాయి. ఒక విధంగా వీరు అద్వైతానికి శూద్ర స్వభావాన్ని జోడించారని చెప్పవచ్చు.

**6. శక్తి ఆరాధన**

తత్త్వకారులంతా శాక్తేయులు. అదే విధంగా విగ్రహారాధకులు కాదని ముందే చెప్పుకున్నాము. శక్తిస్వరూపిణిగా పార్వతి, లక్ష్మి, కాళిక వంటి దేవతలను ఆరాధించారు.

వీరబ్రహ్మం - కాళికాంబ భక్తుడు. ఆమె పేరు మీద కాళికాంబశతకం రాశాడు. శక్తి ఆరాధాకులు అయినందువల్ల పురుషదేవుళ్ళను కూడా శక్తి పరంగానే చూశారు తప్ప, వారికి ప్రత్యేక అస్తిత్వాన్ని ఇవ్వలేదు. భజనల్లో గణపతి ప్రార్థన ఉన్నప్పటికీ గణపతికి విశేషమైన ప్రాధాన్యమేమీ ఇవ్వలేదు. గణపతిని కేవలం శక్తిసంతానంగా చూశారు.

"ఈశ్వరీ నిన్నే నమ్మితి భూలోకమాతా" అని పోతులూరి ఈశ్వరమ్మ అంబ ప్రార్థన చేసింది.

"అపరంజి బంగారుబొమ్మ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

తనయుడను నేను తల్లినీవమ్మ"[21] అని కైవారం నారాయణ లక్ష్మీదేవిని ఆరాధించాడు. ఆయనే గంగాదేవిని ఇలా స్తుతించాడు.

"యేమమ్మా గంగాభవానీ - నిన్ను నమ్మితి శంకరురాణీ

కన్నతల్లివి కరుణ జూడవే - కపటమెందుకు దాచినావె ..."[22]

అంటూ యోగి నారాయణ నీటికోసం గంగాదేవిని ప్రార్థించారు. శ్రీ అమరనారేయణ వేదాంత సారావళి గ్రంథ ఆరంభ తత్త్వాలలో విద్యా ప్రదాయిని సరస్వతిని కీర్తించారు.

**7. రాయలసీమ తాత్వికులు**

ఈ తత్త్వ ప్రక్రియను అవ్ంభించింది ఎక్కువగా రాయలసీమ కవులే! పోతులూరి వీరబ్రహ్మం, ఆయన మనుమరాలు ఈశ్వరమ్మ కడప, కర్నూలు జిల్లాల్లో జీవించారు. వీరబ్రహ్మం రాయలసీమ, కర్నాటక ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించాడు. ఆయన శిష్యుడు సిద్ధయ్య బనగానపల్లి ప్రాంతవాసి. ఆయన దళిత శిష్యుడు కక్కడు కడప ప్రాంతం వాడు. యోగి నారాయణ అనంతపురము జిల్లా సరిహద్దులో, ఆంధ్ర కర్నాటక సరిహద్దు ప్రాంతమైన కైవారం గ్రామస్తుడు. యాగంటి లక్ష్మయ్య కర్నూలు జిల్లాలోని యాగంటి నివాసి. పీరు మొహిద్దీన్, గుజ్జల నారాయణదాసు రాయలసీమంతటా సంచారులుగా తత్త్వాలు పాడుకుంటూ పర్యటించారు. బోరా అప్పలస్వామి ఉత్తరాంధ్ర ప్రాంతం వాడైనప్పటకీ రాయలసీమలోనే ఈ ఇద్దరివెంట సంచరించాడు. రాయలసీమల్లో వచ్చిన కరువువల్ల అప్పలస్వామి సూచన మేరకు వీరిద్దరూ గోదావరి ప్రాంతాలకు వలస పోయినట్లు ఐతిహ్యం. రాయలసీమ నుండి వెళ్ళి గుజ్జల నారాయణదాసు ధవళేశ్వరంలో స్థిరపడ్డాడు. అతని గురువు కనకయ్య రాయలసీమవాడు. అతని పూర్వీకులు కూడా రాయలసీమకు చెందినవారే!

**8. ఆస్థానేతర కవులు**

సంకీర్తనాచార్యుడైన అన్నమయ్య కొంతకాలం సాళువ నరసింహుని ఆస్థానంలోని వాడు. రామదాసు గోల్కొండ సుల్తానులకాలంలో అధికారి. త్యాగయ్య, క్షేత్రయ్యలు అనేకమంది రాజులను సందర్శించారు.

పోతన, అన్నమయ్య, ధూర్జటి వంటివారు ఆస్థానేతర కవులైనప్పటికీ తత్వరచయితల్లాగా ప్రత్యామ్నాయ సమాజాన్ని, సాహిత్యాన్ని, శ్రామిక జీవితాన్ని గురించి మాట్లాడలేదు. ధూర్జటి శ్రీకాళహస్తిలో మామిడితోటలో ఉన్నట్లుగా శ్రీకాళహస్తీశ్వర శతకంలో చెప్పుకున్నప్పటికీ శ్రామికకవి అని చెప్పడానికి లేదు. పోతన శ్రామికుడైనప్పటికీ శూద్రుడు కాదు. అందువల్ల తత్వకవులలో కనిపించే శూద్రముద్ర ఈ పండిత కవుల్లో కనిపించదు. తత్వకారులందరూ మహాసామ్రాజ్యాలు పతనం తర్వాత పాలేగాళ్ళ కాలంలో జీవించారు. ఏ పాలెగాన్నీ ఆశ్రయించలేదు. పైపెచ్చు వారిని వ్యతిరేకించారు కూడా! 17, 18, 19 శతాబ్దాల్లో సామాన్య ప్ర్రలలో మమేకమయ్యారు. సంకీర్తనాకారుల స్ఫూర్తితో పాట ప్రక్రియను స్వీకరించినప్పటికీ, సంకీర్తనకారుల దృక్పథాన్ని అంగీకరించలేదు. అందరూ శ్రామిక కులాలకు చెందినవారు. శ్రమనే వారి జీవనోపాధికి ఆధారం. ఆస్థానకవులు, అన్నమయ్య, క్షేత్రయ్య పదకవులు శృంగార సంబంధ రచనలు చేశారు. కానీ తత్వరచయితలలో అణుమాత్రమైనా శృంగార స్పర్శ వీరి తత్త్వాలలో కనిపించదు. శృంగార రచనలను వీరు తీవ్రంగా నిరసించారు.

"చచ్చుపుచ్చుకైత పచ్చి శృంగారాన

చెప్పికవులు మున్ను మెప్పుగొనిరి

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

నీతినిష్ట లెల్ల నిప్పులపాలాయె"[23] అని నైతికనిష్టకు గొప్ప ప్రాధాన్యత ఇచ్చి, నైతిన వర్తనాన్ని పాటించారు. స్త్రీలను గౌరవంగా చూశారు. దానికి కారణం శ్రమలో స్త్రీభాగస్వామ్యాన్ని గుర్తించడమే!

"భూమిలోన బుట్టు భూసారమెల్లను

తనువులోనబుట్టు తత్త్వమెల్ల

శ్రమలోన బుట్టు సర్వంబుతానౌను"[24] అన్న వేమన మార్గాన్ని తత్త్వరచయితలు ఆచరించారు. పాలెగాళ్ళ వ్యవస్థలో అస్థిరమైన భౌతిక పరిస్థితులలో శ్రామిక కులాల అస్తిత్వాన్ని స్పష్టంగా తత్వాలు ప్రకటించాయి. సామ్రాజ్యాలు నేర్పించిన వీరత్వం, యుద్ధం, స్వర్గలోకంలో అప్సరసలిచ్చే సుఖం వంటి అశాస్త్రీయ ఛాందస భావనలు కాకుండా శ్రమ గొప్పదనాన్ని కీర్తించారు.

**9. ఛందస్సు**

వీరు పండిత కవులు ప్రయోగించిన వృత్త ఛందస్సుల జోలికి పోలేదు. మాత్రా ఛందస్సులు, జాతులు, ఉపజాతులు వంటి దేశీలయ ఛందస్సులను స్వీకరించారు. అంతేగాక ఏలలు, కోలాట పాటలు వంటి జానపద దేశీయ ఛందోరీతులలో రచనలు చేశారు. పండితులను ఆకర్షించడానికి వీరు ఏమాత్రం ప్రయత్నించలేదు. వీరి లక్ష్యం సామాన్య ప్రజానీకానికి తమ భావాల్ని చేరవేయడం. వారిని చైతన్యపరచడం. అందువల్ల వృత్తరీతులను, మార్గశైలినీ వదిలి దేశి జానపదులను పాటించారు.

**ద్విపద** మదపుటేనుగు భంగి మహిమీద జనులు

మతిలోన దలపగ మత్తులై యుంద్రు[25]

**యాలలు** సన్నంపు దిడ్డి వాకిట పున్నమ వెన్నెలలైటా

కిన్నెరాల నాదమింటిరా ఓ వినగా వినగ వింతలాయరా[26]

**మాత్రఛందం** భజన యెట్టిదో తెలియరా

నిజము కనుగొని నడువరా

అజుడు రాసిన వ్రాతకొలదిగా

సుజనులకు ఇది చిక్కురా[27]

వీరిలో చక్కని కవితా పాటవముతో పద్యము రాయగలిగిన వారు కూడ కొందరున్నారు. వేమన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరబ్రహ్మం 'కాలికాంబ సప్తశతి' పేరుతో ఏడు వందల ఆటవెలదులు రాశాడు. కైవారం నారాయణ అమరనారాయణశతకం రాశాడు. 'తారకామృతసార' తత్వత్రయంలో ఒకడైన గుబ్బల నారాయణదాసు 'ఇరువది వక వెయ్యారు వందలూ' హారతులిచ్చినట్లు చెప్పుకున్నాడు. అతడు రాసిన కేవలం 11 పద్యాలు మాత్రమే లభిస్తున్నాయి. అందులో ఒక సీసం, నాలుగు ఆటవెలదులు, ఆరు కందపద్యాలు మనముందున్నాయి. లభించిన పదకొండు పద్యాలను బట్టి, అతడు వైదుష్యం కలవాడని అర్థమవుతుంది.

**10. నామముద్ర**

వీరు రాసిన ప్రతి తత్వం తమదని ప్రకటించుకోవడానికి తత్వం చివర తమ నామాల్ని చేర్చారు. ప్రతితత్వం చివర రచయితపేరు ఖచ్చితంగా ఉంటుంది.

"దాసజనుల రక్షించే జగదీశ రారా

ఆశించియున్న నారాయణ దాసునేరా"

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

"పెద్దలా సాంగత్యమున ప్రసిద్ధమై బోధకనుగొని
వద్దనున్న వికార గుణములు వదలుమనెడి పీరుమొహిద్దీన"[28]
"అనుపమ మంత్రము ఆ గంటయ్య చిత్తము తెలిసిన కొందరికి"[29]
కందిమల్లయ్య పురవరములో మందిరమ్మున వెలిసియుండె
యింద్రుడైన పోతులూరి వీరగోవిందమ్మ జననీ"[30]
"తెలిసి తెలియని వారివెల్ల యాల వొడ్డూ
తోచునట్లా బాలురాకు నేమి తెలియురా
ఓ పోతులూరయ్య బ్రహ్మజ్ఞానులైతే తెలుసురా"[31]
గురుకులము తెలిసి తెలియక సిద్ధగురు కారణమేకులము[32] (సిద్ధయ్య)

ప్రతి తత్వంలో రచయిత పేరు చెప్పడానికి ప్రధానకారణం, ఆ రోజులలో ఇటువంటి గురువులు శిష్యులు అనేకమంది ఉండటమే! "బైరాగి వేషాల పూజచేయనేమి పుణ్యమబ్బు" అని వీరబ్రహ్మం ప్రశ్నించడమే గాకుండా

"కోడిపల్లవరీకి గురువుతో నుండిన
శిష్యులకును సుంతచేయురాడు
నమ్మినమ్మకున్న దుమ్ముపాలగుదురు"[33] అని శిష్యపరివారాన్ని హెచ్చరించాడు. శిష్యపరంపరకు తాము రాసిన తత్వాల ద్వారా చైతన్యపరచడం కోసం నామముద్రను ఖచ్చితంగా పాటించేవారు.


**11. విలక్షణ సంగీత ప్రక్రియ**

హిందుస్థానీ సంగీతంలో ధ్రుపద్, గజల్, ఖవ్వాలీ వంటి సంగీత ప్రక్రియలున్నట్లే, కర్ణాటక సంగీతంలో కూడ సంకీర్తనలు, తిల్లానాలు, తత్వాల వంటి సంగీత ప్రక్రియలు ఉన్నాయి. తత్వాలు అచ్చమైన దేశీయ సంగీత ప్రక్రియ.

తత్వంలో సంకీర్తనల్లాగే పల్లవి, అనుపల్లవి, చరణం లాంటి సాధారణ లక్షణాలతో నడుస్తాయి. కర్ణాటక సంగీతానికి జానపద శూద్రస్వభావాన్ని అలంకరించిన ప్రక్రియ తత్వం. తిరుమలలో లభించిన రాగిరేకులలో అన్నమయ్య సంకీర్తనలు రాగసూచితంగా మాత్రమే ఉన్నాయి. తామ్రపత్రాలలో తాళ ప్రస్తావనలు లేవు. కానీ, తత్వాలలో ఆదినుండి తాళరాగ సూచితమే.

శాస్త్రీయ సాహిత్యంలో మాదిరిగా తత్వకారులెవ్వరూ సంగీతంలో విద్వాంసులు కారు. తమకున్న పరిమితమైన సంగీత, సాహిత్య పాండిత్యంతోనే జానపదుల భాషలో తత్వాలు రాసారు. అందుకే ఆయా రాగాలలో కీర్తనల్లాగా స్వరబద్ధం కాదు. విశేషమైన గమకాలు, ఆలాపనలు తత్వాలలో ఉండవు. అందువల్లనే పల్లె ప్రాంతాలలో కీర్తనలు, పదాల కంటే తత్వాలకే విస్తృతమైన ప్రచారం లభించింది. తత్వాలకు కోలాటాలలో ప్రచారముంది. భజన కూటాలలో సంకీర్తనలతో సమానంగా ప్రాధాన్యత ఉంది. కపిల పాటలు, వ్యవసాయ సంబంధమైన జానపదాలలో సంకీర్తనలకు కాకుండా తత్వాలకే విశేషమైన ఆదరణ లభించింది.


జానపదులు ఏకాంతంగా, సామూహికంగా తత్వాలను ఆలపిస్తారు. తంబూర, ఏకతార వంటి వాయిద్యాలతో స్వరాన్ని కలుపుకొని, పాడుకొంటూ ఆత్మజ్ఞానాన్ని సాధించాలనుకుంటారు. బాలమురళీకృష్ణ వంటి సంగీత విద్వాంసులు తమ కచేరీలలో తత్వాలకు తగిన గౌరవాన్నిచ్చారు.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in


**పాదసూచికలు**

1. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 13
2. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 45
3. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 38
4. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 37
5. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 46
6. తెలుగు జాతి వివేకము, పేజి 3
7. కాళికాంబ సప్తశతి, పేజి 127
8. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 14
9. తారకామృత సారము, పేజి 4
10. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 43
11. తారకామృత సారము, పేజి 32
12. తారకామృత సారము, పేజి 18
13. తారకామృత సారము, పేజి 25
14. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 19
15. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 32
16. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 31
17. తారకామృత సారము, పేజి 27
18. తారకామృత సారము, పేజి 30
19. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 46
20. తారకామృత సారము, పేజి 23
21. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 27
22. శ్రీ అమరనారాయణ వేదాంత సారావళి, పేజి 10
23. కాళికాంబ సప్తశతి, పేజి 57
24. వేమన శతకము, పేజి 101
25. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 8
26. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 21
27. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 21
28. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 28
29. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 4
30. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 8
31. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 11
32. కాలజ్ఞాన తత్త్వములు, పేజి 25


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(2), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

33. కాళికాంబ సప్తశతి, పేజి 47

**ఆధార గ్రంథాలు**

1. ఆరుద్ర, సమగ్ర ఆంధ్రసాహిత్యము, 2వ సంపుటము, తెలుగు అకాడమి, 2012.
2. ఉమర్ అలీషా, తత్వసందేశము, శ్రీ ఉమర్ అలీషా కవి గ్రంథ ప్రచురణ సంఘము, పిఠాపురం, 1952.
3. కాళికాంబసప్తశతి, ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ, 2019.
4. కోదండ రామిరెడ్డి, మరుపూరు, లోకకవి వేమన, వేమన ఫౌండేషన్, అనంతపురం, 2023.
5. గోపి, ఎన్. ప్రజాకవి వేమన, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2000.
6. నాగయ్య, జి. తెలుగు సాహితీ సమీక్ష, 2వ సంపుటము, నవ్యపరిశోధక ప్రచురణలు, హైదరాబాద్, 2011.
7. నారాయణ, టి., కైవారం నారాయణతాత, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2008.
8. మధుసూదనరావు, త్రిపురనేని, సాహిత్యంలో వస్తుశిల్పాలు, విరసం, హైదరాబాద్.
9. లక్ష్మీకాంతం, పింగళి., ఆంధ్రసాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2012.
10. వీరాచార్యులు, పి.బి., వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర, గొల్లపూడి వీరాస్వామి సన్స్, రాజమండ్రి, 2015.